# డాక్టర్ వాణి

గైనిక్ వార్డు, పేషంట్లు మూలుగులతో, మాటలతో అటూ యిటూ తిరిగే ఆయాలు' నర్సులు, లేడీ డాక్టర్లతో హడావిడిగా వుంది. ఆ వార్డు ఎప్పుడూ అలానే వుంటుంది. అంతేకాదు, భరించరాని దుర్వాసన పేషంట్లను చూడటానికి వచ్చిన వారిని, సాయంగా వచ్చినవారినీ, సగం చంపుతూ వుంటుంది.

సత్యవాణి అవుట్ పేషంట్లకని వేసిన బల్లమీద కూర్చుని ప్రసవవేదన భరిస్తూంది. ఆమె దగ్గరగా కూర్చున్న ఆమె తల్లి సుభద్రమ్మకు పిలిస్తే కసురుకునే ఆయాల్ని, పేషంట్లను అసలు పట్టించుకోని నర్సులనీ, తన కూతురివైపు చూడని డాక్టరమ్మలనీ చూస్తుంటే కోపం వస్తోంది.

ఇంటిదగ్గరే ప్రసవమౌతుంది డాక్టర్ని ఇంటికే రప్పిద్దాం అని తాను అంది. కాని కూతురికి ఆప్రేషను చేయించుకునే

T.F.
865



ఉద్దేశ్యముండటంతో తప్పనిసరిగా హాస్పిటల్‌కి రావాల్సి వచ్చింది.

తనలానె తమవాళ్ళకు సాయంగా వచ్చినవాళ్ళు అనుకుంటున్నారు. ఇప్పుడు పలకరు. వెళ్ళేరోజు డబ్బులకు పీక్కు తింటారు. ఇవ్వకపోతే పబ్లిక్‌గా గట్టిగానే తిడతారు. పేషెంట్లని వార్డులో వేసినందుకు పదిరూపాయలు పుచ్చుకుంటుంది. నిన్న యెవరో ఒకామె ఈ బల్లమీదే ప్రసవమైపోయిందట. లోపల బల్లమీద వేశాక అస్సలు చూడరు. ప్రసవమయ్యే సమయంలో యెవరన్నా ఆమెదగ్గర వుండటం ఆమె అదృష్టమే. అదిగో ఆమె శాస్త్రిగారి అమ్మాయి, సుశీలా డాక్టరు; అని ఒకామె, వార్డులోంచి తిన్నగా యెటో నడచి వెళ్తున్న పెద్ద పెద్ద పువ్వులచీర కట్టుకున్న డాక్టరమ్మ వైపు చూపిస్తూ అంది.

విన్న సుభద్రమ్మ చివాలున లేచి, సుశీలా డాక్టరు వైపు గబగబా నడిచింది. జాతి బ్రాహ్మణులు. మెత్తని మన సుండవచ్చు! అని ఊహించిన సుభద్రమ్మ, 'మేడమ్' అని పిల్చింది వినయంగా.

చప్పున వెనుతిరిగి, చిరాకుగా సుభద్రమ్మ వైపు చూసింది సుశీలా డాక్టరు.

'మేడమ్ డాక్టర్...' ఆమె అప్రసన్నతే గమనించిన సుభద్రమ్మ తడబడిపోయింది.

'చెప్పేదేదో తొందరగా చెప్పు, ఏమిటంటావు నువ్వు?' తర్జని ఊపుతూ కసిరినట్లు అడిగింది సుశీలా డాక్టరు.

'ఎంత పొగరు? ఈమె యీ వృత్తికి తగినదేనా?' అనుకున్న సుభద్రమ్మ తనను తాను తమాయించుకుంటూ 'అమ్మాయిని ఒకసారి చూస్తారని' అంది అదే వినయంతో.

'చూస్తాన్లే వెళ్ళు' అని మళ్ళీ విసవిస నడుసూ వెళ్ళి పోతున్న సుశీలా డాక్టర్ని చూస్తుంటే వళ్ళు మండింది సుభద్రమ్మకు. ఐనా తానేం చెయ్యగలదు? అవసరం ఆమె అసహనాన్ని తొక్కి పెట్టింది.

సుశీలా డాక్టర్ నువ్వు అని ఏకవచన ప్రయోగం చెయ్యటం గుర్తువచ్చి తన చీరవైపు తనవైపూ చూసుకుంది సుభద్రమ్మ.

రాత్రి రెండుగంటలకు కూతుర్ని తీసుకుని హాస్పిటల్‌కు వచ్చింది. చీర నలిగి తలరేగి, ముఖమంతా జిడ్డుపట్టి వుంది.

'వ్యక్తి విలువకన్నా, వేషం విలువే ఎక్కువ' అనుకొని నవ్వుకుంది సుభద్రమ్మ.

మళ్ళీ వచ్చి కూతురిపక్కన కూర్చుంది భరించరాని దుర్వాసన, ముక్కుకి రుమాలు అడ్డం పెట్టుకుంటూ 'అసలీ వాసన ఆరోగ్యమైన వాళ్ళనికూడా రోగగ్రస్థుల్ని చేస్తుంది. ఇక్కడ స్టాఫెలా భరిస్తున్నారో' అనుకుంది సుభద్రమ్మ.

బాత్‌రూమ్‌లూ, మరుగుదొడ్లూ బరబరా చీపురుతో తుడుసూ - 'సెండాలం చేసేశారు సెండాలం. ముండల కాళ్ల

రిగిపోయాయా! ఇక్కడే! కూకుంతారు? కాల్లూ సేతులూ నేవ్వా? మనుసులు కారూ? ఇలా కంగాలిసేత్తే యాల్ల అమ్మ మొగుళ్లు కడుగుతారా?' ఇలా సాగిపోతోంది లచ్చి ధోరణి.

తెల్లవారి మెల్లగా సూర్యకిరణాలు వార్డులో కిటికీల చువ్వలమధ్య నుంచి అక్కడక్కడ పరచుకుంటున్నాయి.

వార్డులో చివరన, పెద్ద టేబిలు, దానిమీద పెద్ద బైండు పుస్తకాలు రెండు, చుట్టు నాలుగు కుర్చీలు ఉన్నాయి. అప్పటివరకూ ఓ పుస్తకంలో ఏదో రాస్తూ కూర్చున్న సిస్టరు, ఆ పుస్తకం ముడవకుండానే రెండుచేతులూ దిండుగా చేసుకుని వాటిమీద ముఖం ఆనించి కూర్చునే నిద్ర పోతోంది.

టోపీలా తలా ఎర్రంచు ముతక చీరా కట్టుకున్న అయా అటువయిపు రావడంతో 'డాక్టర్లు ఎవరన్నా వస్తారా ఇప్పుడు వార్డులో పేషంట్లని చూడటానికి' అడిగింది సుభద్రమ్మ.

'ఏట సూడాల నీ కూతురికి? ఇప్పుడే పురుడు రాదు. ఆళ్ళంతా డాక్టర్లే, సూడలేదూ!' అని వెళ్ళిపోయింది మళ్ళీ ఆయా!

'కడవంత గుమ్మడికాయ కత్తిపీటకు లోకువ' నవ్వు కుంది సుభద్రమ్మ.

'అమ్మా! భరించలేకపోతున్నానమ్మా! బెడ్ ఇస్తా

రేమో అడుగమ్మా!' అంది సత్యవాణి బాధగా తల్లివైపు చూస్తూ.

సిస్టరు దగ్గరకు వెళ్ళింది సుభద్రమ్మ.

తలవంచి ఏదో రాసుకుంటున్న సిస్టర్ని పిలిచింది సుభద్రమ్మ.

తల ఎత్తకుండానే 'ఊ' అంది సిస్టర్.

'అమ్మాయి రాత్రినుంచీ బల్లమీదనే కూర్చుంది.' సుభద్రమ్మ.

'ఐతే ఏం చెయ్యమంటావ్?'

మళ్ళీ ఏకవచన ప్రయోగం. 'బెడ్ యిస్తే...' అంది అంది సుభద్రమ్మ.

'కాళీ ఉంటే ఇవ్వమా!' ఎదురు ప్రశ్న.

'చూడండి సిస్టర్......అమ్మాయి కూర్చోలేక పోతోంది.'

'పడుకోమను' తల ఎత్తి సుభద్రమ్మ వయిపు చూడకుండానే చెప్పింది సిస్టరు.

మళ్ళీ కూతురు దగ్గరకు వచ్చింది సుభద్రమ్మ.

చిన్న పొట్టి జడ మడిచి కట్టివున్న ఒక అమ్మాయి సిస్టరు కూర్చున్నవైపు వెళ్ళింది. సిస్టరు చివాలున లేచి నిలుచుంది.

ఆ అమ్మాయి డాక్టరయి ఉంటుంది అనుకున్న సుభద్రమ్మ ఆమెనేదో అడగాలని ఆత్రతగా లేచి నిల్చుంది.

సిస్టరుతో రెండు నిమిషాలు మాట్లాడి, వార్డులో ఉన్న టేబిలువైపు వస్తున్న ఆ అమ్మాయి వైపు చూసింది సుభద్రమ్మ.

చామనఛాయ, గుండ్రని ముఖం, ఒత్తుగా దిద్దినట్లున్న కనుబొమ్మలు, కొంచం చివర నొక్కినట్లున్న ముక్కు. గుండ్రని కనులు, గెడ్డంమీద చిన్న పుట్టుమచ్చ. మెడలో పొట్టిగా ఉన్న నల్లపూసల దండ, చెవులకు ఒంటి ముత్యాలూ, గులాబిరంగు టెర్లిన్ చీర, అదేకలరు బ్లౌజూ. పొడుగూ పొట్టీ కాని ఆకృతి, మొత్తం ఆకర్షణీయంగా, ఆ వృత్తికి తగినట్లుగా వుందా అమ్మాయి.

టేబిలు దగ్గరగా వెళ్ళి 'డాక్టర్' అని నమస్కరించింది సుభద్రమ్మ.

ప్రతినమస్కారం చేసి, 'ఏమిటి?' అన్నట్లు సుభద్రమ్మ వయిపు చూసిందా అమ్మాయి.

రాత్రి రెండు గంటలకు తాను హాస్పిటల్‌కి వచ్చి, కూతుర్ని అడ్మిట్ చేసిన విషయం చెప్పింది సుభద్రమ్మ.

"నెప్పులు ఎక్కువగా వస్తున్నాయా! మీ అమ్మాయి ఎక్కడ? అడుగుతూనే లేచి నిల్చుంది డాక్టరు వాణి.

సత్యవాణిని చూపించింది సుభద్రమ్మ.

మళ్ళీ కూర్చుని, ఎడ్మిట్ చేసిన కాయితాలు సుభద్రమ్మ దగ్గర తీసుకొని వివరాలు అడిగి. కేస్ షీటు వ్రాసింది డాక్టరు వాణి.

ఒకరొకరే టేబులుచుట్టూ మూగటం తమ విషయం చెప్పటం ప్రారంభించారు.

'అమ్మాయిని ఓసారి చూడండి డాక్టర్......' అంది సుభద్రమ్మ.

చూస్తాను కూర్చోండమ్మా!' చెప్పింది డాక్టర్ వాణి.

'ఆ గొంతులో ఎంత సౌమ్యం!' అని మనసులోనే డాక్టర్ని అభినందించి, మళ్ళీ కూతురు పక్కన బల్లమీద కూర్చుంది సుభద్రమ్మ.

తలవంచి కేస్ షీట్లు వ్రాస్తూన్న డాక్టర్ వాణి ముఖం లోకి చూస్తున్న సుభద్రమ్మకు ఆమె ముఖంలో ఎవరివో పోలికలు. సుభద్రమ్మ పరిశీలనగా చూసింది, ఎవరిలా ఉండే వారు చెప్మా! ఆలోచించటం మొదలుపెట్టింది,

ఎన్నవ కాన్పు.

భర్త ఉద్యోగం.

అడ్రసు. ఒక్కొక్కటే వివరాలు అడుగుతున్న డాక్టరు వాణి గొంతు మృదువుగా మధురంగా ఉంది.

ముచ్చటగా రెప్పవాల్చకుండా వాణి వైపే చూడ సాగింది సుభద్రమ్మ.

పదిహేను నిమిషాల తర్వాత లేచి నిల్చుంటూ, 'నడవ గలరా? వస్తారా?' అని అడిగింది డాక్టరు వాణి, సత్యవాణి వైపు చూస్తూ.

నెమ్మదిగా లేచి డాక్టరు వాణి వెంట నడిచింది సత్యవాణి. వారిని అనుసరించి, నాలుగు అడుగులు ముందుకునడిచి, ఆయా తన కూతురి చెయ్యిపట్టి నడిపించుకు తీసుకు వెళ్ళటంతో ఆగిపోయింది సుభద్రమ్మ. ఆమెకు తెలుసు, డాక్టరు పరీక్షించే గదిలోకి తాను వెళ్ళకూడదు అని.

తిరిగివచ్చిన సత్యవాణికి ఖాళీగావున్న బెడ్ చూపిస్తూ 'దానిమీద పడుకోండి' అని చెప్పి, సుభద్రమ్మతో 'మధ్యాహ్నంలోపున డెలివరీ అవుతుందమ్మా' అని చెప్పింది డాక్టర్ వాణి.

'థాంక్సు' బరువుగా ఊపిరి పీల్చి వదిలింది సుభద్రమ్మ.

మరొక ఇద్దరు డాక్టర్లు వచ్చారు. అందరూ టేబిలు ముందున్న కుర్చీల్లో కూర్చున్నారు.

లేబర్ రూమ్‌లోంచి 'నన్నొగ్గండర్రో మా మావని పిలవండర్రో' అని అరుస్తూంది ఎవరో పేషంటు.

లేచి లేబర్ రూమ్‌లోకి వెళ్ళి, ఐదు నిమిషాల తర్వాత మళ్ళీ వచ్చి టేబిలుముందు కూర్చుంచి డాక్టర్ వాణి.

'నన్నొగ్గండర్రో ముండల్లారా! నా మొగుణ్ణి పెళ్ళా

డండ్రా, నాను సచ్చిపోతన్నాను దేవుడా! మీకు సెడుగాలం రానూ... నన్ను ఒగ్గండ్రా. ఓరి దేవుడా! ఓ డాక్టరమ్మో! తల్లీ నన్నొగ్గేసిపోనావా!" పెద్దగా రోదిస్తూంది పేషంటు.

"ప్చ్...ఆమెకు సవ్యంగా డెలివరీ అయ్యేట్లులేదు. సరిగా పడుకోదు యేం చేద్దాం?" అని తన దగ్గర కూర్చున్న తోటి డాక్టర్లవైపు చూస్తూ అడిగింది డాక్టర్ వాణి.

"అదే అవుతుంది. ఇలాంటి పేషంట్లు ఒకరన్నా ఉంటే కాని ఈ వార్డుకి అందం ఉండదు" అందో డాక్టరు.

పెదవులు కదిలీ కదలనట్లు అందంగా నవ్వింది.

అదే నవ్వు, ఆ నవ్వు...గుర్తువచ్చింది సుభద్రమ్మకు. 'సందాక నూకాలు' ఇలానే నవ్వేది.

"అయివుంటుంది. ఈ అమ్మాయి సందాక కూతురై ఉంటుంది. హరిజనులకు ప్రభుత్వం ప్రత్యేక విద్యా సౌకర్యాలు కల్పించింది కదా" అనుకుంది సుభద్రమ్మ.

కూతురుకి బెడ్ ఇవ్వటం ఆమెకు తృప్తిగా ఉంది. కూతురి తలక్రింద దిండు సరిచేసి, ఆమెచేత కాఫీ తాగించింది. తానొక కప్పు కాఫీతాగి, తలవిప్పి మళ్ళీ ముడి చుట్టుకుంటూ ఎవరన్నా వస్తే బాగుండును ఇంటికి వెళ్ళి స్నానం చేసి చీర మార్చుకుని వచ్చేదానను అనుకుంది సుభద్రమ్మ. కూతురి అత్తగారి ఆడబిడ్డ చెప్పారు, 'ఉదయమే మేం వస్తాం. మీరు ఇంటికి వచ్చి స్నానం చెయ్యొచ్చు' అని.

సత్యవాణి మంచం దగ్గర బల్లమీద కూర్చున్న సుభద్రమ్మ ఆలోచనలు గతంలోకి మళ్ళాయి.

* * *

సందాక నూకాలు ఆ రోజే ఏడవ తరగతిలో చేరింది. ఆడపిల్లలు కూర్చునే బెంచీ చివర ఒదిగి ఒదిగి కూర్చుంది.

నల్లగా ఎర్రగా వున్న జుట్టు బిగుతుగా జడ అల్లుకుంది. తలకి రాసిన నూనె మెడలు ముఖం జిడ్డు వేసింది. నుదుట నల్లని అసురుచుక్కా, కనులకు బర్రికాటుగా, నల్లని ముఖం, ఖద్దరు పరికిణీ, కాలరు జాకెట్టూ క్లాసులో కూర్చున్న ఆడా మగా, పిల్లలవైపు బెదురు బెదురుగా చూస్తుంది.

ఆ పిల్ల మాల. సుభద్రమ్మ చెవిలో పక్కనకూర్చున్న వరలక్ష్మి గుసగుస లాడింది.

చప్పున కాస్త వెనక్కి జరిగింది వరలక్ష్మి దగ్గరగా సుభద్రమ్మ.

వరలక్ష్మి ఆ మాట అనటమే తడవు ఆ బెంచీమీద కూర్చున్న మరో యిద్దరు ఆడపిల్లలు సత్యవతి, జానకీ కూడా వెనక్కి జరిగారు.

సుభద్రమ్మ, వరలక్ష్మి, సత్యవతి, జానకీ ఒకరికి ఒకరు దగ్గరగా, ఇరుకుగా బెంచీకి ఈ చివర కూర్చుంటే ఆ చివర సందాక నూకాలు కూర్చుంది.

మధ్యన గజం మేర ఖాళీ.

"బ్యాలన్స్ సరిపోదు" ఎవరో కొంటె కుర్రాడు అరిచాడు.

స్వాతంత్ర్య సమరం సాగుచున్న రోజులవి. ఇంకా మనుష్యులు మాలలని అసహ్యించుకుంటూనే ఉన్నారు. 'మాలలు' అగ్రజాతుల వారిని చూస్తూ బెదురుతూదూరంగా తప్పుకుంటూనే వున్నారు. అగీకాక, అది పల్లెటూరిలో వున్న హైయర్ ఎలిమెంటరీ స్కూలు. అందులో నెల రోజుల క్రితం నూకాలు బావ టీచరుగా చేరాడు. నూకాలు అక్కకు పని పాట్లు సాయం చెయ్యటానికి, చదువుకోటానికీ ఈ ఊరు వచ్చింది.

మాలమాస్టారు అప్పన్న మాష్టారు మరదలట. సుభ ద్రమ్మ చెవిలో గుసగుసలాడింది వరలక్ష్మి.

'మరో బెంచి దీనికి వేయిస్తే బాగుండును' అంది జానకి.

క్లాసులో పిల్లల మాటలు గోలగా వినరావటంతో.

"సైలెన్సు సైలెన్సు" బెత్తంతో డ్రాయరుమీద కొట్టారు అవధాని మాస్టారు.

అంతా నిశ్శబ్దమై పోయింది.

మాష్టారు ముక్కుపొడుం పీల్చి "నీ పేరేమిటి అమ్మాయీ!" అని అడిగాడు నూకాల్ని.

సూకాలు లేచినిల్చుని చెప్పింది. "సందాక సూకాలు" అని.

"మీ బావ చెప్పాడులే...కూర్చో" అని, అతను ఉదయం మొదట పీరియడు లెక్కల పాఠం ప్రారంభించాడు.

నూకాలు చెప్పిన మూడు లెక్కలూ ఆన్సరు తప్పు చేసింది.

ఆమె చేతిలో పలక అందుకోలేదు అవధాని మాస్టారు "అక్కడ పెట్టు" అన్నాడు మూడుసార్లూ, డ్రాయరుమీద చేత్తో కొట్టి.

అలాగే చేసింది నూకాలు.

"మీకు చదువులేమిట్రా. గవర్నమెంటుకు బుద్ధిలేదు గాని" అని నూకాలు మీద విసుక్కుని, "ఇంటిదగ్గర మీ బావని లెక్కలు చెప్పమను. నిన్నెవరు ప్రమోట్ చేశారో ఏడవ తరగతికి" అన్నారు.

ఆ పిల్ల ఏమీ మాట్లాడలేదు.

నూకాలు పేరు 'సందాక'గా మారింది మర్నాటికి.

'సందాక' ఇంకా రాలేదూ! ఎటెండెన్సు వేస్తూ అడిగారు అవధాని మాస్టారు.

మొదటి సారిగా ఆ నామకరణం ఉచ్చరించిది ఆయనే.

తర్వాత అందరూ నూకాల్ని సందాక అనేవారు.

ప్రతిరోజూ ఇంచుమించు లేటుగానే వచ్చేది 'సందాక'

ఓ రోజు ఆదరా బాదరాగా వచ్చిన సందాక బట్టల మీద పసుపు మరకలు చూసి ఆమె క్లాసులో అడుగు పెట్ట గానే మగపిల్లలంతా ఘొల్లున నవ్వారు.

మాస్టారి బెత్తం టేబుల్ని బాదింది.

బిక్కమొహం వేసుకొని బెంచి చివర కూర్చుంది సందాక.

ఆ పిల్ల తనతోటి ఆడపిల్లలతో మాట్లాడాలని ప్రయ త్నించేది. కాని వాళ్లు మాట్లాడటానికి ఇష్టపడేవారు కాదు. నోట్సులు యిచ్చేవారు కాదు.

'సందాక' వైపు చూసి చీదరింపుగా, "ఏమిటలా చింపిరిగా, మురికిగా క్లాసుకి వస్తావు? బుద్ధిలేదూ!" అన్నారు అవధాని మాస్టారు.

సుభద్రమ్మ వయిపు చూసి "అక్కయ్యకి జ్వరం బాబుకి నీళ్లు పోశాను. మరొక జత బట్టలు లేవు" నెమ్మదిగా అంది సందాక.

మరొక రోజు సందాక బట్టలు నల్లగా మాసి, ఇంకా నల్లని మరకలతో ఉన్నాయి. ముఖం జిడ్డుగా మకిలిగా ఉంది. ఆమె పుస్తకాలు కూడ మురికిగానే వుండేవి.

అవధాని మాస్టారు ఆమె వయిపు చురచుర చూస్తూ "స్టాండప్ సందాకా" అరిచాడు.

తృళ్ళిపడ్డట్టయు చివాలున లేచి నిల్చుంది సందాక.

"నీ కెన్నిసార్లు చెప్పాను. ఉతికిన బట్టలు కట్టుకొని స్కూలుకి రావాలనీ, ముఖం జిడ్డు లేకుండా కడుక్కురమ్మనీ, పుస్తకాలు మురికిగా వుంటే ముట్టుకోననీను, యూ గెటౌట్ నాన్ సెన్స్. బుద్ధిలేదూ" పెదవులు వణుకుతూంటే గట్టిగా అరిచినట్లని "నువ్వు అక్కడ నిల్చుంటే ఇక్కడికి వస్తుంది వాసన" అన్నారు అవధాని మాస్టారు.

తల వంచి నిల్చున్న సందాక కన్నీళ్ళు చెంపల మీది నుంచి బొట్లు బొట్లుగా జారుతున్నాయి. జాలిపడింది ఒక్క సుభద్రమ్మే. మిగతావారు కిసుక్కున నవ్వి నోటికి చేతులు అడ్డం పెట్టుకున్నారు.

"కూర్చో" రెండు నిమిషాలతర్వాత సర్దుకుని అన్నారు అవధాని మాస్టారు.

కూర్చుని ఆ పిరియడు పాఠం అయి అతను అవతలకు వెళ్ళాక సుభద్రమ్మతో నెమ్మదిగా అంది సందాక "చాకలి బట్టలు పారేశాడు. బావ కొత్త బట్టలు దర్జీకి ఇచ్చాడు. అతను ఇంకా ఇవ్వలేదు." అని.

"ఉతుక్కుని కట్టలేకపోయావా?" అంది సతంవతి.

"తీరిక లేదు. అక్క వంట్లో బాగోలేదు. వంట నేనే చేస్తాను." అంది సందాక.

"బడిమానెయ్. ఎంచక్కా" ఎగతాళిగా అంది జానకి.

"ఊరుకొండబ్రా వాళ్ళ బావ వస్తున్నాడు." అంది వరలక్ష్మి.

వస్తున్న మాస్టారుతో అవతలికి వెళ్ళి మళ్ళీ వచ్చి కూర్చుని "దర్జీ బట్టలు ఇచ్చాడట మధ్యాహ్నం మార్చుకుంటాను బట్టలు" అంది సందాక.

సందాకకు, చెవికి ముక్కుకి అభరణాలేం ఉండేవికావు. చేతులకు మట్టిగాజులుండేవి. ఆ పిల్ల తెలుగుపాఠం యాసతో చదువుతుంటే, ఘొల్లున నవ్వేవారు క్లాసులో పిల్లలు.

అవధాని ఆ పిల్ల ఉచ్చరించిన మాట తాను వత్తిపలికి వెక్కిరించి, "పిడకలా ముఖం నువ్వూ. నీకు చదువేమిటి" అని అసహ్యించుకునేవారు.

మాస్టారి తిట్లూ, చివాట్లూ, క్లాసులోని పిల్లల హేళనలూ, తోటి ఆడపిల్లల నిరసనలూ, చీత్కారాలూ అన్నీ సహించేది సందాక.

ఎనిమిదవ క్లాసు పూర్తిగా చదివి పరీక్ష వ్రాయకుండానే ఆమె తోటి అమ్మాయిలూ చదువు విరమించుకున్నారు.

ఎయిత్ స్టాండర్డు పరీక్ష వ్రాసి ప్యాసయింది సందాక. అంతవరకే సుభద్రమ్మకు తెలుసు. తర్వాత సందాక ఏ ఊర్లో ఉందో ఏమిటి చేస్తోందో ఆమెకు తెలియదు.

సత్యవాణి పెద్దయైన సంవత్సరం సుభద్రమ్మ అన్న "సందాక" తెలుగుపూడిలో ఉంది. స్కూలు టీచరుగా చేస్తూంది. నీ వివరాలు అడిగింది. పెళ్ళిచేసుకుందట. ఒక కూతురట" అని చెప్పాడు సుభద్రమ్మకు.

'స్కూలు టీచరు చేస్తుందా' అని ఆశ్చర్య పోయింది సుభద్రమ్మ.

ఒక వేళ ఈ అమ్మాయి సందాక కూతురేమో! అను కుంటున్న సుభద్రమ్మ కూతురు గట్టిగా మూలగటంతో లేచి నిల్చుంది.

* * *

కూతురు డిస్‌చార్జి అయి ఇంటికి తీసుకుపోతున్న రోజు తమ కెంతో సహకరించిన డాక్టరు వాణికి కృతజ్ఞతలు చెప్పాలని గైనిక్ వార్డు వయిపు నడిచింది సుభద్రమ్మ.

డాక్టర్ వాణి హరిజన స్త్రీ అని ఆమె తల్లి టీచర్ అనీ విషయ సేకరణ చేసి ఆమె సందాక కూతురని తెలుసుకుంది సుభద్రమ్మ. ఆ విషయం నిజమే అని వాణి నోటి మీదుగా కూడా వినాలనుకుంటోంది.

తనకు ఎదురైన వ్యక్తిని చూస్తూ తక్కున ఆగిపోయింది సుభద్రమ్మ. నెరసిన తలా, ముడుతలు పడ్డ ముఖం. దళసరి కళ్ళద్దాలూ, పంచకట్టూ ఫుల్ చేతుల లాల్చీ, చేతి కర్రా, అవధాని మాష్టారు! తొందరగానే గుర్తుపట్టింది.

"మాష్టారూ నమస్కారం. నేను సుభద్రమ్మను. మీరు అవధాని మాష్టారు కదూ!" అని అడిగింది సుభద్రమ్మ అతన్ని చూడగలిగినందుకు సంతోషం గొంతులో వ్యక్తమవు వుంది.

కళ్ళజోడులోంచి ఆమె వైపు గుచ్చిగుచ్చి చూస్తూ బోసి నోటితో గర్వంగా నవ్వుకుంటూ 'సుభద్ర! ఆ! అవధాని మాష్టార్నే. కులాసానా తల్లీ. మా మాష్టారుగిరీ అందరూ తేలికగా చూస్తారు కాని చూడు, మాలా ఎవడన్నా ఏ ఉద్యోగి అయినా జీవితాంతం నమస్కారం అందుకో గలడా! అయినా ఈ హాస్పిటలువాళ్ళు ఎలా కసిరికొడతా రనుకున్నావు? అమ్మాయి ప్రసవించింది. మా అవస్థ దేవుడి కెరుం. పక్క దుప్పట్లు మార్చరు మాట వినిపించుకోరు. 'వాణీ డాక్టరుట. ఆ అమ్మాయి మాత్రం చెబాస్ అను కున్నాను. ఆ పిల్ల దయగా చూస్తుంది పేషంట్లని" అని ఆగి "నువ్వెందుకు వచ్చావ్?" అడిగారు అవధాని.

"మా అమ్మాయి ప్రసవానికి వస్తే నేను వచ్చాను. రండి మీ అమ్మాయిని చూస్తాను." అని గైనిక్ వార్డు వయిపు నడిచింది సుభద్రమ్మ. ఆమెతోనే నడిచారు అవధాని.

అవధాని కూతుర్ని పలకరించి టేబిల్ ముందు కూర్చుని ఏవో వ్రాసుకుంటున్న డాక్టరు వాణీవైపు చూసి "రండి మాష్టారూ" అని నడిచింది సుభద్రమ్మ.

'డాక్టర్' అని పిలిచింది సుభద్రమ్మ.

తలెత్తి చూసి నవ్వుతూ 'వెళ్ళిపోతున్నారా?' అడిగింది వాణీ డాక్టరు.

"ఔను. ఓ విషయం అడుగుతాను. ఏమీ అనుకోరు కదూ?' అని అంది సుభద్రమ్మ.

"అడగండి" అనే నవ్వుతో అంది వాణీ డాక్టరు.

"మీ అమ్మ టీచర్ కదూ?"

"ఔనూ!"

"ఆమె పేరు"... అని ఆగి వాణి ముఖంలోకి చూసింది సుభద్రమ్మ.

"ఏదో పాత పేరు. నూకమ్మట." అని తలవంచి నవ్వుకుంది వాణీ డాక్టరు.

"మీ అమ్మా, నేనూ కలిసి చదువుకున్నా"

"ఓ ఐసీ..." కనుబొమలెగరేసింది వాణీ డాక్టరు.

"సందాక కూతురా!" నోరావలించారు అవధాని మాష్టారు.

"అమ్మని అడిగానని చెప్పు. నా పేరు సుభద్రమ్మ. నీలాటి అమ్మాయి తన కడుపున పుట్టటం సందాక అదృష్టం. అంది సుభద్రమ్మ.

"సందాక అంటారా అమ్మని?" నవ్వుతూ అడిగింది వాణి డాక్టరు.

"అవును. అలానే పిలిచేవారం. ఈయన మా గురువుగారు. ఏడవతరగతిలో క్లాసు టీచరు. అవధాని మాష్టారు." వాణీ డాక్టరుకి పరిచయం చేసింది సుభద్రమ్మ.

లేచి నమస్కారం చేసింది డాక్టరు వాణి.

మాష్టారు మాత్రం ఆశ్చర్యం నుంచి తేలుకోలేదు. ఆయన తెరచిన నోరు మూత పడలేదు.

—:o:—